క్లుప్తంగా

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ



విద్యా కానుక కిట్లు అందజేస్తున్న ఎంఈఓ

నగరి: నగరి పట్టణ, రూరల్ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు జగనన్న విద్యా కానుక కిట్లను బుధవారం ఎంఈఓ శ్రీదేవి అందజేశారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పూర్తి స్థాయిలో జగనన్న విద్యా కానుక కిట్లు అందజేశమని, పాఠశాల ప్రారంభంలోనే విద్యార్థులకు కిట్లు అందజేస్తామని ఆమె తెలిపారు.

ఏఓ బాధ్యతల స్వీకరణ

నింద్ర: మండల వ్యవసాయాధికారిగా తులసిరాం బుధవరం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న మురళీకృష్ణ కేవీబీపురానికి బదిలీ అయ్యారు. వైఎస్సార్ కడప జిల్లాలో పనిచేస్తున్న తులసిరాం నింద్రకు బదలీపై వచ్చారు. రైతులకు సూచనలు, సలహాలు, అర్‌బీకేల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



కాలువను శుభ్రం చేస్తున్న కూలీలు

నింద్ర: మండల కేంద్రమైన నింద్ర పంచాయతీలో బుధవారం పారిశుద్ధ్య పనులను చేపట్టారు. మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేశారు. పేరుకుపోయిన చెత్తను తొలగించారు. పిచ్చిమొక్కలను తొలగించారు. పనులను సర్పంచ్ వసంతమ్మ పరిశీలించారు. స్వచ్ఛ గ్రామానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

అనాథ మహిళకు అంత్యక్రియలు

నారాయణవనం: అనారోగ్యంతో మృతి చెందిన ఒంటరి మహిళ దహన సంస్కారాన్ని సాంప్రదాయబద్ధంగా చేశారు. వివరాలు.. స్థానిక దక్షిణమాడ వీధిలో వసుమతి(59) ఒంటరిగా నివసిస్తోంది. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె బుధవారం సాయంత్రం మృతి చెందింది. స్థానికుల సమాచారంతో మాజీ ఎంపీపీ సుదర్శనరెడ్డి, ఎంపీపీ దివాకర్ రెడ్డి, చిన్నదొరై స్పందించారు. పంచాయతీ కార్యాలయంలో దక్షిణ మాడవీధి వారితో చర్చించారు. వసుమతి బంధువులకు సమాచారమిచ్చినా ఎవరూ స్పందించలేదు. స్థానిక బ్రాహ్మణుల సహకారంతో వారి సాంప్రదాయం ప్రకారం వసుమతి దహన సంస్కారాలను పూర్తి చేయించారు.

భక్తులందరికీ 'జలప్రసాదం'



జలప్రసాద కేంద్రం వద్ద ఆలయ చైర్మన్, ఈఓ

కాణిపాకం (యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు నిత్యం జలప్రసాదం ఇవ్వనున్నట్టు పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. హైదరాబాద్‌కు చెందిన దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ ఆలయ పరిసరాల్లో నాలుగు చోట్ల రూ.64.50లక్షలతో జలప్రసాద కేంద్రాలను ఏర్పాటు చేసింది. వాటిని ఎమ్మెల్యే, ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు ఉదయం ప్రత్యేక పూజల అనంతరం ప్రారంభించారు. ఎమ్మెల్యే జల ప్రసాదాన్ని సేవించారు. జల ప్రసాద కేంద్రాలను ఏర్పాటు చేసిన ప్రైవేటు కంపెనీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

ముక్కంటి సేవలో సినీనటి దివి



సినీనటి దివి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం సినీనటి దివి దర్శించుకుంది. ఆలయ దక్షిణ గోపురం వద్ద పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆమెకు స్వాగతం పలికారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం పలికారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

క్రీడలతో మనో వికాసం

- మంత్రి సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి
- క్రీడాకారులకు మెడల్స్, ట్రోఫీ అంజేత



మెడల్స్, ట్రోఫీ అందుకున్న విద్యార్థులతో వైఎస్సార్‌సీపీ నేత రాంప్రసాద్‌రెడ్డి

నగరి: క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం లభిస్తుందని మంత్రి ఆర్కే రోజా సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక కేవీకే మైదానంలో 10 రోజులుగా జరిగిన సమ్మర్ క్యాంప్‌లో క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్, టెబుల్ టెన్నిస్, వాలీబాల్, హ్యాండ్ బాల్, చెస్ పోటీల్లో శిక్షణ పొందిన వారికి, రోజా చారిటబుల్ ద్వారా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు మెడల్స్, ట్రోఫీ, సర్టిఫికెట్లు అందజేశారు. బుధవారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో బహుమతుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రాంప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై క్రీడాపోటీల్లో శిక్షణ పొందిన వారికి మెడల్స్, సర్టిఫికెట్లు, క్రికెట్ ట్రోర్నమెంట్‌లో అండర్ 14, అండర్ -16 విభాగాల్లో విజేతలకు, రన్నర్‌గా నిలిచిన జట్టుకు ట్రోఫీని అందజేశారు. బ్యాటింగ్, బౌలింగ్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు జ్ఞాపికలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరం అన్నారు. వాటిపై కూడా ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడలు మానసిక దృఢత్వాన్ని ఇవ్వడంతో పాటు మేధాశక్తిని పెంచుతుందన్నారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రొత్సహించడంలో ఆర్కే రోజా చారిటబుల్ ట్రస్టు ఎప్పుడు ముందుంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నీలమేగం, ఎంపీపీ భార్గవి, ఆర్‌బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు అయ్యప్పన్, విజయపురం వైస్ ఎంపీపీ బాలాజీ, సాప్ కోచ్ బాబు, పీఈటీలు గోపి, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం



నగరిలో స్కానింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న అడిషినల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ

నగరి: లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, అలాంటి వాటికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా అడిషినల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రవిరాజు అన్నారు. బుధవారం నగరి డివిజన్ పరిధిలోని లింగ నిర్ధారణ పరీక్ష కేంద్రాలు, రికార్డులను ఆయన తనిఖీ చేశారు. ఫామ్-ఎఫ్ నియమ నిబంధనలను ఉల్లంఘిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గర్భిణులకు స్కానింగ్ చేసే సమయంలో నిబంధనలు పాటించాలని సూచించారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ డీఈడీఓ, సిబ్బంది ఉన్నారు.

పుష్పయాగానికి అంకురార్పణ



పుష్పయాగానికి అంకురార్పణ చేస్తున్న అర్చకులు

పిచ్చాటూరు: నాగలాపురం శ్రీ వేదనారాయణ స్వామి ఆలయంలో బుధవారం పుష్పయాగానికి అంకురార్పణ చేశారు. ఆలయ మహా మండపంలో మేదిని చిత్రపటాన్ని రూపొందించి విశ్వక్సేనుల వారి ఎదుట అర్చకులు ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి సర్వసేనాధిపతిని తిరుచ్చి వాహనంపై ఆశీనులు చేసి గ్రామంలో ఊరేగించారు. పుష్పయాగాన్ని గురువారం మధ్యాహ్నం 3 నుంచి 5.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి తెలిపారు.

చల్లంగా చూడు గంగమ్మ



గంగమ్మను దర్శించుకుంటున్న రాంప్రసాద్‌రెడ్డి

నగరి: కాకవేడు గ్రామ దేవత గంగమ్మను క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు రాంప్రసాద్ బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు గంగమ్మ కమిటీ పెద్దలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు. ప్రతి ఒక్కరిని చల్లాగా చూడాలని అమ్మని వేడుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట నగరి వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

పరశురామేశ్వరస్వామి సేవలో సీఐడీ ఐజీ



పరశురామేశ్వరస్వామి ఆలయంలో సుశీల్ కుమార్ నాయక్

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయంలో సీఐడీ ఐజీ సుశీల్ కుమార్ నాయక్ బుధవారం సాయంత్రం పూజలు చేశారు. ఆలయ పూజారులు ఆయనకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. అనంతరం శ్రీకాళహస్తికి వెళ్లారు.

గ్రామీణులు ఐక్యంగా మెలగాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ

పాలసముద్రం: గ్రామాల్లో కులాలు, మతాలకు అతీతంగా అందరూ ఐక్యంగా మెలగాలని ఎస్‌ఐ సురేష్ అన్నారు. బుధవారం పాలసముద్రం పోలీస్‌స్టేషన్‌లో భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. మండల పరిధిలోని హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు అన్నదమ్ములలా మెలగాలని కోరారు. చిన్న గొడవలకు కూడా ఆస్కారం లేకుండా ఐక్యంగా ఉండాలని సూచించారు. శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఆకట్టుకున్న అర్జున తపస్సు



కార్వేటినగరంలో..



వెదురుకుప్పం: తపస్మాన్ అదిరోహిస్తున్న అర్జున వేషధారి

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా బుధవారం అర్జున తపస్సు ఘట్టం ఆహుతులను ఆకట్టుకుంది. అంతకు ముందు ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు చేశారు. తదుపరి ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో అమ్మవారిని అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అర్జున వేషధారి శివతత్వ గీతాలతో తపస్మాన్ అధిరోహించే సన్నివేశాలు ఆకట్టుకున్నాయి. సంతాన ప్రాప్తి కోసం మహిళలు వరపడ్డారు. అర్జునుడి వేషధారి విసిరిన నిమ్మకాలు, పూజా సామగ్రి కోసం భక్తులు ఎగబడ్డారు. మధ్యాహ్నం భాగవతారిణి నాగరత్నచే హరికథ కాలక్షేపం జరిగింది. ఎంపీపీ నాగరాణి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు.

-కార్వేటినగరం: మహాభారత ఉత్సవాల్లో భాగంగా కొల్లాగుంటలో బుధవారం నిర్వహించిన అర్జున తపస్సు భక్తులను అలరించింది. వేకువ జామున స్వావారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ద్రౌపదీదేవి, శ్రీకృష్ణ, భీమ, అర్జున, నకుల, సహదేవుల ఉత్సవ విగ్రహాలను గ్రామవీధుల్లో ఊరేగించారు. 11 గంటలకు ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన తపస్సుమాను వద్దకు చేరుకున్న అర్జున వేషధారి పద్యాలను ఆలపిస్తూ తపస్సుమాను అదిరోహిస్తూ వెంట తీసుకెళ్లిన విబూది, నిమ్మ కాయలను భక్తులపై విసిరారు. వాటి కోసం భక్తులు ఎగబడ్డారు. బట్టువారిపల్లి గ్రామానికి చెందిన వరదరాజులు కుటుంబ సభ్యులు విజయదుర్గ, నవీన్, కిరణ్ ఉభయదారులుగా వ్యవహరించారు. అలాగే కొల్లాగుంట గ్రామానికి చెందిన పి.జ్యోతి, మునికుమార్ భక్తులకు అన్నదానం చేశారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



పుత్తూరులో పౌష్టికాహారం అందుకున్న గర్భిణులు

పుత్తూరు రూరల్: పౌష్టికాహారం అందిస్తున్న మంత్రి రోజమ్మ మేలు ఎప్పటికీ మరువలేమని పలువురు గర్భిణులు అన్నారు. స్థానిక వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో బుధవారం పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులు ×రోజా చారిటబుల్ ట్రస్ట్× ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని అందుకున్నారు. మంత్రి చేపట్టిన సేవా కార్యక్రమాన్ని కొనియాడారు. పరీక్షల నిమిత్తం వేచివుండే సమయంలో గర్భిణులు భోజనానికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజా పుత్తూరు, నగరి ప్రభుత్వ ఆస్పత్రుల్లో పౌష్టికాహార పంపిణి కార్యక్రమాన్ని రెండున్నరేళ్లుగా నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం చికిత్స నిమిత్తం వచ్చిన గర్భిణిలకు, వారి సహాయకులకు యథావిధిగా వెజిటబుల్ పలావ్, వైట్‌రైస్, గుడ్డు, కర్రీస్, పచ్చడి, సాంబారు, రసం, పెరుగు అన్నం, చిక్కీ, అరటిపండును అందించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యాధికారి శంకర్ నరేష్, డాక్టర్లు ప్రశాంతి, అశోక్‌కుమార్, ప్రకాష్, ప్రసాద్, మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్ డి.జయప్రకాష్, జి.నారాయణస్వామి, పుష్పమ్మ పాల్గొన్నారు.

థాంక్యూ రోజా మేడం



మేమిద్దరం కవలలం. మా పేర్లు ఉమా, ఉషా. మాది డీఎంపురం గ్రామం. ఇద్దరం గర్భం దాల్చడంతో పుత్తూరు ఆస్పత్రికి చెకప్‌కు వచ్చాం. ఇక్కడికి వచ్చాక తెలిసింది రోజా మేడమ్ ప్రతి వారం చెకప్‌కు వచ్చే అందరికీ పౌష్టికాహారాన్ని పెడుతున్నారని. ఎంతో సంతోషంగా ఉంది. థాంక్యూ రోజా మేడం.

– ఉమా, ఉషా డీఎంపురం, కార్వేటినగరం మండలం

అభివృద్ధి పనుల పరిశీలన



పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి

పుత్తూరు రూరల్: పట్టణ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి కాంట్రాక్టర్లను ఆదేశించారు. బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.10 లక్షల అంచనా వ్యయంతో కళ్యాణపురం గ్రామంలో తాగు నీటి పైపులైన్ పనులు జరుగుతున్నట్లు తెలిపారు. పుత్తూరు హరిజనవాడలో రూ.8.25 లక్షలతో పైప్ లైన్ పనులు ప్రారంభించినట్లు చెప్పారు. గణపతి నగర్‌లో డ్రైనేజీ పనులను రూ.5 లక్షలతో చేపట్టామన్నారు. ఒంటిమిట్ట గ్రామ శ్మశానానికి రోడ్డు ఏర్పాటుకు స్థల పరిశీలన చేసినట్లు తెలిపారు. అనంతరం పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. ఫంక్షన్ హాల్స్ నిర్వాహకులు డ్రమ్స్ ఏర్పాటు చేసుకుని, తడి పొడి చెత్తలను వేర్వేరుగా మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని సూచించారు. ఆదేశాలను అమలు చేయని ఫంక్షన్ హాల్స్ నిర్వాహకులకు అపరాధం విధించడంతో పాటు వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు



పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ గోవిందయ్య, స్థానికులు

వెదురుకుప్పం: మండలంలోని బొమ్మయ్యపల్లె పంచాయతీ దేవళంపేటలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు యువత సన్నాహాలు చేస్తున్నారు. తిరుపతి-చిత్తూరు ప్రధాన రహదారి పక్కన భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు స్థానిక సర్పంచ్ చొక్కా గోవిందయ్య తెలిపారు. ఈ మేరకు విగ్రహాన్ని ఉంచేందుకు దిమ్మెలు నిర్మించి నిచ్చెన కూడా అమర్చనున్నట్లు పేర్కొన్నారు. బుధవారం పనులను పరిశీలించారు. త్వరలో జరగనున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఉప ముఖ్యమంత్రి కె. నారాయణస్వామి చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

సొంతింటి కల సాకారమే లక్ష్యం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీఈ వెంకటేశ్వర్లు

పాలసముద్రం: పేదల సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని హౌసింగ్ డీఈ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం పాలసముద్రం మండల పరిధిలోని కన్నికాపురం, వనదుర్గాపురం, సన్నగుంట గ్రామాల్లో ఉన్న జగనన్న లేఅవుట్లను పరిశీలించారు. గృహనిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న లేఅవుట్లను ఏర్పాటు చేసిందన్నారు. లబ్ధిదారులు గృహనిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ప్రభుత్వం ఉచిత ఇసుక, తక్కువ ధరకు సిమెంట్, సకాలంలో బిల్లులు చెల్లిస్తోందని తెలిపారు. లేఅవుట్లలో తాగునీరు, విద్యుత్, రోడ్లు తదితర వసతులపై ఏఈ, ఇంజినీరింగ్ అస్టెంట్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఆరా తీశారు.

ఓం శక్తి ఆలయానికి భూమిపూజ



శ్రీరామాపురంలో భూమిపూజ చేస్తున్న నాయకులు

నింద్ర: మండలంలోని శ్రీరామాపురం దళితవాడలో ఓం శక్తి ఆలయ నిర్మాణానికి బుధవారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రోజా సోదరుడు రాంప్రసాద్ రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, నగరి అర్‌బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు విజేష్, కోఆప్షన్ సభ్యుడు అనిల్, సింగిల్ విండో చైర్మన్ మునికృష్ణారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, పార్టీ మండల కన్వీనర్ వేణురాజు, నాయకులు మహేష్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సరుకుల పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న క్రాస్ ట్రస్టు ప్రతినిధులు

పాలసముద్రం: మండలంలోని అగ్ని ప్రమాదానికి గురైన గొల్లకంద్రిగ ఎస్టీ కాలనీ వాసులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. క్రాస్ ప్రాజెక్ట్ ట్రస్టు కోఆర్డినేటర్ వేల్కూరు భూపతి కాలనీకి చెందిన ఐదు కుటుంబాలకు రూ.3 వేల విలువైన సరుకులను అందజేశారు. సంస్థ సభ్యులు బాబు, జ్యోతి పాల్గొన్నారు.

రథంపై కల్యాణ వెంకన్న కటాక్షం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో బుధవారం ఉభయ నాంచారులతో కల్యాణ వెంకటేశ్వర స్వామి రథోత్సవంలో భక్తులను అనుగ్రహించారు. రాత్రి అశ్వవాహనాన్ని అధిరోహించిన స్వామి మాడవీధుల్లో విహరించి, ఉభయ నాంచారులు, పద్మావతీ అమ్మవారితో కలిసి ఆర్జిత కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. వేకువ జామున సుప్రభాతసేవతో నిత్యపూజా కైంకర్యాల అనంతరం 5.30 గంటలకు దేవేరులతో కలిసి వెంకటేశ్వరస్వామి తిరుచ్చి వాహనంల్లో రథమండపానికి చేరుకుని 7 గంటలకు రథాన్ని అధిరోహించి వీధుల్లో విహరించారు. దక్షిణమాడవీధిలో అనారోగ్యంతో మహిళ మృతి చెందడంతో సంప్రోక్షణ తదితర కార్యక్రమాలను పూరి చేసి అశ్వవాహన సేవను రెండు గంటలు ఆలస్యంగా నిర్వహించారు. ఆర్జిత కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు తీర్థ ప్రసాదాలు, వస్త్ర బహుమానాన్ని అందజేశారు. టీటీడీ డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ మోహన్, సూపరింటెండెంట్ ఏకాంబరం, ఇంజినీరింగ్ విభాగ అధికారులు పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పుత్తూరు రూరల్ సీఐ సురేష్ కుమార్ నారాయణవనం సర్కిల్ పరిధిలోని సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.